ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 28-10-01, కైకలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు జ్ఞానస్వరూపుడు. ఈశ్వరుని తెలుసుకోవటంఅంటే జ్ఞానాన్నిపొందటమే. భగవంతుడు అంతటా వ్యాపించిఉన్నాడు. అందరి హృదయాలలో అంతర్యామిగాఉన్నాడు, చేతనంలోఉన్నాడు, అచేతనంలోఉన్నాడు. స్థంబంలో దేవుడుఉన్నాడా అని ప్రహ్లాదుడిని హిరణ్యకశపుడు అడిగినప్పడు ఉన్నాడు అనిచెపుతాడు. ప్రహ్లాదుడి మాట నిజంచేయటంకోసం లక్ష్మీ నరసింహస్వామి స్థంబాన్ని చీల్చుకొనివచ్చాడు. ఆత్మస్థితిఅంటే అది మన సహజస్థితి. మనం సహజస్థితికి దూరంగా ఉండటంవలన అది మనకు తెలియటంలేదు. మన మాటలో, చేతలో, దైనందిన జీవితంలో మనం సహజంగాలేము. అందువలన మనకు సహజస్థితి అందటంలేదు. అందువలన మనం ఏమిచేసినా సహజంగా చేయాలి. ధనంఉండటం, ధనంలేకపోవటం, అధికారంఉండటం, అధికారంలేకపోవటం ఇవిఅన్నీ దేహానికి సంబంధించిన విషయములు. ఇవిఅన్నీ స్వప్నసమానము. మనం పొందవలసిన వస్తువు మన హృదయంలో సహజంగాఉంది. దానిని తెలుసుకొంటే మృత్యువును జయిస్తాము. మృత్యువును జయించటంఅంటే దేహం మరణిస్తుంది. దేహం మరణించినా మనకు మరణంలేదు, మనం ఉంటాముఅని సహజంగా మనకు తెలుస్తుంది. మన బుద్ధిలో దోషాలు పెరగటానికి మనలోఉన్న తమోగుణం, రజోగుణం కారణం. ఏదో కొద్దిసేపు జపంచేసాము, ధ్యానంచేసాము అనిఅంటూ మిగిలిన కాలంఅంతా రజోగుణంలోఉంటే ఈ జపధ్యానముల వలన ఏమీ కలిసిరాదు. జపధ్యానములవలన ఏదైనా కొంతశక్తిని సంపాదించినా రజోగుణంతో జీవిస్తే ఆశక్తి అంతా బయటకు పోతుంది.

మీరు చేసేపని శ్రద్ధగా చేసుకోండి. పని విడిచిపెట్టవద్దు అని మీటింగులలో చెపుతూఉంటే కోపాలు వస్తున్నాయి. మీకు కోపాలు రావటంవలన నాకు ఏమీ నష్టంలేదు, మీరు సంతోషించటంవలన నాకు ఏమీ లాభంలేదు. ఇక్కడకు కొంతమంది వచ్చి శ్రవణం చేస్తున్నారు. మీరు రాకపోయినా నాకు నష్టంలేదు, పదివేలమంది వచ్చినా నాకు లాభంలేదు. నాన్నగారు నాన్నగారులాగే ఉంటారు. అంటే నాఉద్దేశం ఏమిటిఅంటే మీకు నామీద కోపం వచ్చినా పరవాలేదు కాని మీరు పనిని విడిచిపెట్టకూడదు. పని విడిచిపెట్టటమే భక్తి అనుకొంటే వాడికి జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. మీకు నామీద విరోధంవచ్చినా నాకు ఏమి ఇబ్బందిలేదు కాని మీరు బాగుపడాలి అది ముఖ్యం. సబ్జక్టు చెప్పేటప్పడు జ్ఞానంగురించి చెపుతాముగాని అది మీకు నచ్చలేదు అని మీ జీవలక్షణాలకు అనుకూలంగా చెప్పే సమస్యలేదు. ధనం సంపాదించాలి అనుకొనేవారు, విద్య నేర్చుకోవాలనుకొనేవారు కష్టపడి వాటిని ఎలా సంపాదించుకొంటారో అలాగే ఆధ్యాత్మిక రంగంలో ఉన్నవారు కష్టపడి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. చేతిలో పైసాలేకుండా బజారులోఉన్న వస్తువులు కొనుక్కోవాలనుకొనేవాడు ఎటువంటివాడో సత్వగుణం లేకుండా జ్ఞానం సంపాదించాలి అనుకొనేవాడు అటువంటివాడే. అందుచేత సత్వగుణం సంపాదించాలి. ఎవరితో సహవాసంచేస్తే సత్వగుణం వస్తుందో వారితో సహవాసంచేయాలి. రజోగుణం ఉన్నవారితోను, తమోగుణం ఉన్నవారితోను తప్పించుకొని తిరిగేవాడు ధన్యుడు. అలాగని వారితో పేచీలు పెట్టుకోకూడదు. మనం సత్వగుణంలో ఉన్నాముఅని అనుకొంటాము. ఎవరైనా తమోగుణంగా, రజోగుణంగా మాట్లాడితే ఈ సత్వగుణం అంతా పోతుంది. మనకు సత్వగుణం సంపాదించాలి అనేబుద్ధిఉందిగాని దానిని పోషించుకోలేకపోతున్నాము, అభ్యాసం చేయలేకపోతున్నాము. సత్వగుణం ఇంకా మనకు సహజంఅవ్వలేదు. మామూలుగా సత్వగుణంఉంటే మంచిదే. అంతమాత్రంచేత ఈశ్వరానుగ్రహం మనకురాదు. రజోగుణం ఉన్నవారి మధ్యకూడ మనం సత్వగుణాన్ని కాపాడుకోవాలి. అప్పడు మనం భగవంతుని దయకు పాత్రులవుతాము, మాయను దారిఇమ్మని చెపుతాడు. మాయ ఈశ్వరుని చేతిలోఉంది. ఆయన దారిఇవ్వమంటేగాని మాయ దారిఇవ్వదు. కొంతమంది ఇళ్ళదగ్గర కుక్కలు ఉంటాయి. మనం వెళితే మొరుగుతాయి, గొడవచేస్తాయి. యజమానివచ్చి చెపితే తప్పకొంటాయి, మనం చెపితే తప్పకోవు. అలాగే మాయ ఈశ్వరునిచేతిలోఉంది. ఆయన దారిఇమ్మంటే మాయదరిఇస్తుందిగాని మనం చెపితే అదివినదు. మనం సత్వగుణంలో నిలబడగలగాలి. సత్వగుణం ఎంతవరకు అభివృద్ధి పొందాలంటే మన దేహప్రారబ్దాన్నిబట్టి రజోగుణం ఉన్నవారు మనకు స్నేహితులుగా దొరికారుఅనుకోండి, వారిమధ్యనకూడా మనం సత్వగుణంలో ఉండాలి. ఈశ్వరుని ఆరాధించటంవలన తమోగుణంలోనుండి, రజోగుణంలోనుండి మనలను విడుదలచేస్తాడు.

మనస్సును దొంగతనం చేసేవాడు గోవిందుడు. గుణాలుఅన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సును దొంగతనంచేస్తే, మనస్సుపోతే దానిలోఉన్న గుణాలు అన్నీపోతాయి. ఇప్పడు మీరు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నారో, అలా ఆత్మతోటి ఎవడైతే తాదాప్యం పొందాడో వాడిలోనుండి ఆధ్యాత్మిక శక్తి ప్రవహిస్తుంది. ఆ శక్తి ప్రవహిస్తూఉంటే మా మనస్సును

నిగ్రహించుకోవాలి అని మీరు అనుకోనక్కరలేదు మీరు చేసే జపంతోటి, ధ్యానంతోటి సంబంధంలేకుండా మీ మనస్సు నిగ్రహింపబడుతుంది, మీరు ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. సత్పురుషుల, జ్ఞానుల జ్ఞపకంచాలు, స్మరణచాలు. పూజ, జపం, ధ్యానంవలన ఏ ప్రయోజనం వస్తుందో వారి స్మరణవలన అంతావచ్చేస్తుంది. శరీరాలు దగ్గరగా ఉండనక్కరలేదు. వారి జ్ఞాపకం చాలు. మీ శరీరం అమెరికాలోఉన్నా భగవంతుడిని స్మరిస్తే నిప్పుమీద నీరు జల్లినట్లు మీ మనస్సులోఉన్న మాటఅంతా, గందరగోళంఅంతా చల్లారిపోతుంది. వారి వైభవం అట్టిది. స్మరణవలననే రజోగుణం సహజంగా అణిగిపోతుంది. రజోగుణం, తమోగుణంఉంటే హింసాప్రవృత్తి వచ్చేస్తుంది. మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసుచేస్తున్నారుఅనుకోండి మీలో ఎంతబలంఉందో భగవంతుడు పరీక్ష చేస్తాడు. మీ ఇంట్లోవారిచేత తిట్టిస్తాడు. మీకు సత్వగుణం నిలకడగా లేకపోతే మీరు తిరిగి తిట్టేస్తారు, మీకు సత్వగుణం ఆక్షణంలోపోతుంది, రజోగుణం వచ్చేస్తుంది. మాటకు మాటఅనేస్తారు. మనకు ట్రైనింగ్ ఇవ్వటంకోసమే భగవంతుడు ఇవిఅన్నీచేస్తాడు.

జీవితంపట్ల సరియైన దృక్పదంఉండాలి. నా జీవితంపట్ల నాకే సరియైన దృక్పదం లేనప్పుడు హృదయంలోఉన్న వస్తువు నాకు తెలియబడదు. మన హృదయంలో ఒకనిజం ఉంది. మనం దాని దగ్గరకు వెళతాము, మరల వచ్చేస్తూఉంటాము. ప్రకృతి వాసనలు అక్కడ నిలబడనీయవు. లోపలున్న నిజంలో స్థిరపడేవరకూ జ్ఞాని మిమ్మల్ని వెంటాడుతాడు. అందరూ మనలను మంచివారు అనుకోవాలి, అందరూ మనలను గౌరవించాలి అనుకోవటం ఒక పిచ్చితనం. కొంతమంది ఉంటారు వారికి 99 ఉపకారాలుచేసినా ఏదోఒకటి చేయకపోతే వారికి మనకు విరోధం, ఈ 99 ఉపకారాలు మర్చిపోతారు, మనలను విరోధుల లిస్టులో చేర్చేస్తారు. ఇటువంటి మనషులతో మనం గౌరవాలు ఎంతకాలం పొందుతాము. ఇంట్లో ఏకాంతంగా కూర్చొని అరుణగిరిని స్మరణ చేసుకొంటున్నారుఅనుకోండి. స్మరణకూడా సత్సంగం. ఎందుచేతనంటే దానివలన నీకు మానసిక అనుబంధం వస్తుంది. మానసిక అనుబంధంవలన నీ మనస్సు పవిత్రంఅవుతుంది. సత్సంగంవలన ప్రాపంచిక విషయములతో సంబంధం తెగిపోతుంది. మనం భగవంతుని స్మరణచేస్తాము, భావనచేస్తాము. అందులోకూడా ద్వైతంఉంది. భగవంతుని స్మరించగా, స్మరించగా విషయచింతనపోతుంది, తరువాత నెమ్మదిగా భగవంతుని చింతనకూడా పోతుంది. భగవంతునికంటే నేను వేరుగాఉన్నానుఅనే వేరుబుద్ధిపోతుంది. అది సద్భావస్థితి. ఆ స్థితిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఆ స్థితిని నోటితో చెప్పలేము. అది అనుభవైక వేద్యం. డబ్బు సంపాదించటం తేలిక, విద్యను సంపాదించటం తేలిక కాని మంచితనం సంపాదించటం చాలాకష్టం. మంచితనంవలన మీకు జ్ఞానంకలుగుతుంది. మీరు సాధనచెయ్యండి. నేను చెప్పినట్లు చేయనక్కరలేదు. మీకు ఇష్టమైన పద్దతిలో సాధనచెయ్యండి. కాని అహంకారం సర్వనాశనం అయ్యేవరకు సాధనవిడిచిపెట్టవద్దు.

విమర్శ ప్రధానంగా పెట్టుకొన్నవారు చిన్న మంచిపనికూడా చేయరు. కొంతమందికి విమర్శ అలవాటు ఉండదు. చేస్తేమంచిపనిచేస్తారు లేకపోతే నిర్మలంగా ఉంటారు. వారు చిన్నపనికూడా పెద్దమనస్సుతోచేస్తారు, ప్రేమతోచేస్తారు. అలాచేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. దేనిపట్ల ఆసక్తిపెట్టుకోవద్దు. అలాగని ప్రేమనివిడిచిపెట్టవద్దు. ఆసక్తివేరు, ప్రేమవేరు. ఆసక్తి మనలను బంధిస్తుందికాని ప్రేమబంధించదు. ఈ శరీరంఉండగానే మనం ముక్తిస్థితినిపొందాలి. నీవు ఆ స్థితిని పొందలేకపోతే, ఆ స్థితిపొందినవారు ఎక్కడైనా ఉన్నారేమో వెతికి, వెతికి వారి సాంగత్యంచెయ్యి. వారితో శారీరకంగా దగ్గర ఉండనక్కరలేదు, మానసిక అనుబంధం సరిపోతుంది. చెడుతలంపులు రాకుండా చూసుకోవాలి. అందరూ బాగుపడాలి, అభివృద్ధిలోనికిరావాలి అనుకోవాలి. మానసిక దారిద్ర్యం ఉండకూడదు. మానసిక దారిద్ర్యం ఉన్నవారికి మోక్షంరాదు. ఆత్మానుభవం పొందినవారిలో ప్రశాంతత తాండవిస్తూఉంటుంది, వారు శక్తివంతులుగాఉంటారు, వారు ఆనందంలో ఊగిసలాడుతూఉంటారు. వారిలోనుండి శాంతి, కాంతి ప్రసరిస్తూఉంటుంది. గూటిలోనుండి విడుదలచేసిన పక్షికి ఎంత స్వేచ్ఛవస్తుందో, అజ్ఞానంనుండి బయటపడినప్పుడు మనకుకూడ అంత స్వేచ్ఛవస్తుంది. వాడు నిజమైన సుఖి.

మీకు ఏ కారణంవలనఅయినా గర్వంవస్తోంది అనుకోండి, దాని వెనకాలే గర్వభంగం వచ్చేస్తుంది. అనుకరణవద్దు. అనుకరణచేస్తూఉంటే అది మన బలహీనతకు గుర్తు. మన సంసారమునకు తగినట్లుగా మనం వ్యవహరించాలి, గొప్పలకు వెళ్ళవద్దు, అనుకరణవద్దు. ఇలాఉంటే అది మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. నీవు పొందవలసింది ఈ జన్మలోనేపొందు. సత్పురుషులను ఆశ్రయించటంవలన, వారి దయకు పాత్రులవ్వటంవలన నీ హృదయంలోఉన్న వస్తువు ఒక్కసారి తళుక్కున స్ఫురిస్తుంది. పెళ్ళికిముందు రెండు నెలలనుండి చాలా హడావిడి ఉంటుంది కాని ఆ ముహూర్తం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది అలాగే నీహృదయంలోఉన్న వస్తువు ఒక్కసారి తళుక్కున స్ఫురిస్తుంది. పెళ్ళికిముందు రెండునెలల నుండి చాలా హడావిడి ఉంటుందికాని ఆ ముహూర్తం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది అలాగే నీ హృదయంలో ఉన్న వస్తువు స్ఫురించటం కొన్ని క్షణాలలో జరిగిపోతుంది. ఎన్ని ఉపన్యాసాలువిన్నా, ఎన్ని రచనలు మీరుచేసినా, ఎన్ని శాస్త్రాలు అధ్యయనంచేసినా, లోకంలో మీరు ఎన్ని ఘనకార్యాలు చేసినా

అది మీకు లభించదు. సత్పురుషుల సహవాసంవలన, వారి అనుగ్రహంవలన నీలోపలున్న వస్తువునీకు స్ఫురిస్తుంది. నీ పూర్వపుణ్యంవలన సత్పురుషుల సహవాసం నీకుదొరికిందిఅనుకో నీకు నియమాలతోను, వ్రతాలతోను పనిలేదు. నియమాలుఅన్నీ మనోచాపల్యం తగ్గించటానికే. సత్పురుషుల సహవాసంవలన మనస్సు, ఇంద్రియాలు వాటిఅంతటఅవే నిగ్రహించబడతాయి ఇంక నియమాలతో నీకుపనిలేదు. మీరు ఒక పనిని నిష్టగా చేస్తున్నారుఅనుకోండి అదే వ్రతం. కల్పవృక్షంఅంటే మీఇంట్లో దారిద్ర్యాన్ని పోగొట్టేదికాదు, కామక్రోధాలనుపోగొట్టేది నిజమైన కల్పవృక్షం. విగ్రహాలను ఆరాధించటంవలన తీర్థాలువలన ప్రయోజనంలేదు అనిచెప్పను అవి వందజన్మలలో తీసుకొనివచ్చే మార్పును సత్పురుషులు ఒక్కజన్మలో తీసుకొనివస్తారు. రజోగుణంనుండి, తమోగుణంనుండి కనుక విడదలపొందలేకపోతే ఈ జన్మలోనేకాదు, రాబోయే జన్మలలోకూడా ఎన్నోదోషాలు అలావస్తూనేఉంటాయి. అందుచేత సర్వవిధముల ప్రయత్నంచేసి రజోగుణంనుండి, తమోగుణంనుండి విడుదలపొందండి.

**ఓం నమో భగవతే శ్రీరమణాయ**

**రమణభాస్కర**

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 19-11-01, జువ్వలపాలెం)**

2A

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనుషులు అందరూ ముముక్షువులుకాదు. మోక్షాన్ని సంపాదించాలనే కాంక్షఉన్నవారిని ముముక్షువులు అంటారు. పూర్వపుణ్యంఉంటేగాని ముముక్షత్వంరాదు. ఆత్మజ్ఞానానికి మరోపేరు మోక్షం. మోక్షంఅంటే విడుదల, దేనినుండి విడుదలఅంటే దేహబుద్ధినుండి విడుదల. మనహృదయంలో బ్రహ్మంఉంది. అది పరమపవిత్రమైనది. అది ఎంత పవిత్రమైనదో మనంకూడా అంతపవిత్రమైతేగాని అందులో ఐక్యంకాలేము. ఎక్కడో బ్రహ్మం వరకు అక్కరలేదు. మనలో చైతన్యస్థాయిలో తేడాఉంటే ఒకరు చెప్పినమాట ఇంకొకరు అర్థంచేసుకోలేరు. ఎందుచేతనంటే అవగాహనలోపం వస్తుంది. భగవంతుడు చెప్పినమాట మనకు అర్థంఅవ్వాలిఅంటే భగవంతుడంతటివారము అయితేగాని ఆయన చెప్పినమాట మనకు అర్థంకాదు. సత్పురుషుల సహవాసంవలన అన్నీవస్తాయి, మోక్షంకూడా వస్తుంది. దేహమునేనుఅనే తలంపునుండి విడుదలపొందటానికి విచారణ అవసరం. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా దేహగతమైన నేనులోనుండి విడుదలపొందాలి, అదే నీజీవితగమ్యం. దేహాభిమానంలోనుండి విడుదలపొందితే అంతటా నీవేఉన్నావని నీకు తెలుస్తుంది. ఆస్థితిపొందటానికి మనలోఉన్న వాసనలు, భోగకాంక్ష అడ్డువస్తున్నాయి. మనం ఎంతసేపు ఈ జీవితాన్ని ఎంజాయ్‌చేయాలని అనుకోవటంవలన మనకు లోచూపు కలగటంలేదు, మనస్సు అణగటంలేదు మనస్సు అణిగితేగాని ఆత్మజ్ఞానంకలుగదు. సాధనచేసేటప్పుడు ఏకాంతంగానేచేయండి, ఏదైనా అధ్యయనంచేసేటప్పుడు నలుగురు కూర్చొని చదువుకోవచ్చుఅని పెద్దలు చెపుతారు నేను అదిచేసాను, నేను ఇదిచేసానుఅని చాలామంది అంటూఉంటారు. ఈశ్వరుడు మనచేత ఏమిచేయిస్తే అది మనంచేయగలంగాని మనవలన ఏమీఅవ్వదు. మనవలన ఏదోఅవుతుంది అనుకొంటున్నాము అందులోనుండి విడుదలపొందాలి. మనం భగవంతుడికి వేరుగాలేము. వేరుగాఉన్నాముఅనుకొంటున్నాము. ఆ వేరుబుద్ధి నశిస్తే ఇక్కడే మనకు భగవదనుభవం కలుగుతుంది, ఆనందం శాంతివచ్చి మనలను వరిస్తుంది. శరీరం చనిపోయేలోపు ఒక్క అంగుళం లోపలకు దిగటానికి ప్రయత్నించండి. లోపలకు దిగితే లోపలఉన్నవస్తువుయొక్క వైభవం నీకు తెలుస్తుంది.

మనస్సు అణిగినప్పడు ఏకాంతవాసంవస్తుంది. విషయచింతన, దేహవాసన, లోకవాసన లేనప్పడు నీవు లక్షమంది మధ్యకూర్చొన్నా ఒంటిరిగా ఉన్నట్లు నీకు అనిపిస్తుంది. మనకు లోపల, బయట అనుకొనే పాడుబుద్ధిపోలేదు. ఇది ఉన్నంతకాలం నీకు ఏకాంతవాసంరాదు. లోపల, బయట అనేది అహంకారానికిఉందికాని ఈశ్వరుడికి లోపలలేదు, బయటలేదు. ఆయన అంతటా ఉన్నాడుకాని నీకు ఒక కేంద్రంచూపించటంకోసం లోపలున్నాడుఅని చెప్పాడు. ఏకాంతవాసం నీలోపలేఉంది. దేహబుద్ధి నశిస్తే ఏకాంతవాసం నీకు దొరుకుతుంది. మనం జిన్నూరులోఉంటే ఒకలాగ, అరుణాచలంలోఉంటే ఒకలాగ ఉంటే అది సరియైన స్థితికాదు. ఈ దేహం ఎక్కడున్నా మనం సమానంగా ఉండగలగాలి, హెచ్చుతగ్గులు ఉండకూడదు. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని హృదయపూర్వకంగాచేస్తూఉంటే మనకు స్వేచ్ఛ కలుగుతుంది, శాంతి కలుగుతుంది. పనిద్వారా మనకు స్వేచ్ఛకలగాలి. ఇష్టం అయిష్టం, గౌరవం అగౌరవం ఈ ద్వంద్వాలకు అతీతంకానివాడికి జ్ఞానంకలుగదు. మీరు విసర్జించే మలంలోఉన్న పురుగును నేనుఅని బాబాచెప్పారు. అంటే I am nothing అనిచెప్పటం. అలాగని మనం ఆయనను తక్కువగా చూస్తున్నామా? లేదు ఆయనకు గుడులుకట్టి ఆరాధిస్తున్నాము. మనలను ఎవరైనా చిన్నమాటఅంటే వారిమీదకోపం తెచ్చుకొంటాము, ఇంక జీవితంపాడుగునా విరోధాలే. రాగం, భయం, కోపం, లోభిత్వం ఇవిఅన్నీ నరకద్వారాలుఅని భగవంతుడుచెప్పాడు. ఒకసారి బాబా దగ్గరకు ఒకపరమలోభి వచ్చాడు వాడిజేబులో వెయ్యిరూపాయలు ఉన్నాయి. వాడికి ఏమీసాధనలేదు. వాడు బాబాగారిని నాకు మోక్షం అనుగ్రహించండిఅని అడుగుతున్నాడు.